సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 576 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాటా గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.16 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

36.4°/21.9°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

కాచిగూడ- కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ఓనం పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాచిగూడ- కొల్లం మధ్య ఈ నెల 28 నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 సాయంత్రం 5:30 గంటలకు కాచిగూడ జంక్షన్ (07044)లో బయలుదేరి మరుసటి రోజు మంగళవారం రాత్రి 11.20 గంటలకు రైలు చేరుతుందన్నారు. తిరిగి 30 బుధవారం సాయంత్రం 7 గంటలకు కొల్లం జంక్షన్ (07045) నుంచి బయలుదేరి శుక్రవారం రాత్రి 12:30కు కాచిగూడ జంక్షన్ చేరుతుందన్నారు. వికారాబాద్, రాయచూరు, మంత్రాలయం, గుంతకల్లు, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట, కాట్పాడి, కొట్టాయం మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. ఫస్ట్ క్లాస్, టూ టైర్, త్రీ టైర్, స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్, హౌస్ వైరింగ్‌పై రూడ్‌సెట్ సంస్థలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి తెలిపారు. సెప్టెంబర్ 11 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 19 నుంచి 35 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండి కనీసం పదో తరగతి చదివిన వారు (పాస్/ఫెయిల్) అర్హులన్నారు. 9618876060, 08554-255925, 9440905479 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ న్యాయం

- చిన్న చిన్న కారణాలతో పథకాలకు దూరమైన వారి గుర్తింపు
- నవరత్నాలు - ద్వైవార్షిక నగదు మెగా చెక్కు పంపిణీ
- జిల్లాలో 5,654 మంది లబ్ధిదారులకు రూ.6.50 కోట్ల పంపిణీ



మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: వేలిముద్రలు పడకనో, కార్మికులు అందుబాటులో లేకనో, లేకపోతే ఇతర సాంకేతిక కారణాలతోనో ప్రభుత్వ పథకాలకు కొందరు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో అలాంటి వారందరినీ గుర్తించి ఏడాదికి రెండుసార్లు లబ్ధిచేకూర్చేలా నవరత్నాలు-ద్వై వార్షిక నగదు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. ద్వైవార్షిక నగదు పంపిణీలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బటన్‌నొక్కి నిధులు విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని పీసీ హాల్‌లో మెగా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ లబ్ధిదారులతో మాట్లాడారు. సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ నళిని, డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి ,నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, చేనేత జౌళి శాఖ ఏడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.182.36 కోట్ల పంపిణీ..

కలెక్టర్ అరుణ్‌బాబు సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతూ లబ్ధిదారులను వెతికి మరీ పథకాలను అందజేయడం చాలా గొప్ప విషయన్నారు. ద్వైవార్షిక నగదు మంజూరులో భాగంగా జిల్లాలో జగనన్న అమ్మఒడి పథకంలో 611 మందికి రూ.9.1 లక్షలు, వైఎస్సార్ నేతన్న నేస్తం కింద 31 మందికి రూ.7.4 లక్షలు, ఈబీసీ నేస్తం 361 మందికి రూ.54.15 లక్షలు, జగనన్న చేదోడు కిందలో 1428 మందికి రూ.142.8 లక్షలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే జగనన్న వసతి దీవెన కింద 1345 మందికి రూ.121.53 లక్షలు, జగనన్న విద్యా దీవెన కింద 1673 మందికి రూ.216.32 లక్షలు, 205 మంది రైతులకు రూ.16.95 లక్షలు అందుతున్నాయన్నారు. 5,654 మంది లబ్ధిదారులకు రూ.650.84 లక్షలు లబ్ధి చేకూరుతోందన్నారు. గత నాలుగు విడతల్లో జిల్లాకు రూ.182.36 కోట్ల నగదు బదిలీ చేయడం జరిగిందన్నారు.

వైఎస్సార్‌సీపీ చరిత్ర సృష్టించడం ఖాయం..

ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిందే రెండు మూడు పథకాలు. అందులోనూ అరకొరగానే ఇచ్చారని విమర్శించారు. జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చి పథకాలు అందుకున్న తమ్ముళ్లు సైతం సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. కుల,మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, అందువల్లే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో గెలుపొంది చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు. రైతులు, మహిళలు, డ్వాక్రా అక్కాచెల్లెమ్మలను నిలువునా మోసగించడంతో గత ఎన్నికల్లో చంద్రబాబుకు బాగా బుద్ధి చెప్పారన్నారు. ఎన్నికలోల ఇచ్చిన వాగ్దానాల్లో 99 శాతం అమలు చేసిన ఘనత దేశంలోనే సీఎం జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు.

అడక్కుండానే చేదోడు



మేము ఏ పథకానికి అర్హులమని ఏ అధికారిని అడగలేదు. ప్రతి పథకం గురించి వలంటీర్, సచివాలయ ఉద్యోగులే వివరించారు. గతేడాది వేలిముద్రలు వేయక పోవడంతో జగనన్న చేదోడు అందలేదు. దీంతో వలెంటీర్‌కు చెప్పాం. వచ్చి వేలి ముద్రలు తీసుకెళ్లారు. నేడు పిలిచి మరీ రూ.10 వేలు అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. పేదల కష్టం తెలిసిన ముఖ్యమంత్రి దేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే ఉన్నారు.

– చాకలి పద్మావతి, బీడుపల్లి

జగనన్నకు రుణపడి ఉంటాం



విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందనే కారణంతో అమ్మఒడి అందలేదు. సచివాలయంలో ఫిర్యాదు చేయడంతో సమస్యను పరిష్కరించడంతో పాటు అమ్మఒడి పథకంలో భాగంగా రూ.15 వేలు అందజేశారు. నేను ఏ అధికారి వద్దకు వెళ్లలేదు. రూపాయి కూడా ఎవరికీ ఇవ్వలేదు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాము.

– షేక్ జమీల, కర్ణాటక నాగేపల్లి

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి పెద్దిరెడ్డి



ప్రారంభానికి సిద్ధమైన హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయం

హిందూపురం: పట్టణంలోని గుడ్డం పరిధిలో ఉన్న పోలీసు క్వార్టర్స్ సమీపంలో నిర్మించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభానికి ముస్తాబైంది. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, బాబురెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఘన స్వాగతం పలికేలా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. భారీ బైక్ ర్యాలీతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు స్వాగతం పలకనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు నూతన పార్టీ కార్యాలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. 1.30 గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించిన నూతన భవనాలు, ల్యాబ్‌ను మంత్రి ప్రారంభిస్తారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసికట్టుగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సమన్వయకర్త టీఎన్.దీపిక పిలుపునిచ్చారు.

శంకరన్నకే పార్టీ పగ్గాలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగింపు
- 45 మందితో నూతన కమిటీని ప్రకటించిన అధిష్టానం



మాలగుండ్ల శంకరనారాయణ

సాక్షి, పుట్టపర్తి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చురుగ్గా పని చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలను ప్రకటించింది. ఇందులో భాగంగానే శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 45 మంది సభ్యులతో కూడిన జాబితాను గురువారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణకు మరోసారి పార్టీ పగ్గాలు అప్పగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా శంకరనారాయణ పని చేశారు. అదే విధంగా జిల్లా విభజన జరిగిన తర్వాత శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. తాజా కమిటీలోనూ ఆయన్నే జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తోందని మరోసారి రుజువైంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వారు కమిటీలో చోటు దక్కించుకున్నారు. అధ్యక్షుడిగా ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఉపాధ్యక్షులుగా బీఆర్‌పీ కేశప్ప (పుట్టపర్తి), జె.అశ్వర్థ (ధర్మవరం), ప్రధాన కార్యదర్శులుగా రామిరెడ్డిగారి కుమారి (పెనుకొండ), మంజునాథ సంజీవరెడ్డి (మడకశిర), మలసాని లక్ష్మీనారాయణ (హిందూపురం), పుల్లారెడ్డి (రాప్తాడు), కోశాధికారిగా సి.భాస్కర్‌రెడ్డి (పుట్టపర్తి)ని నియమించారు. అలాగే కార్యదర్శులుగా కిన్నెర కల్యాణ్ కుమార్ (కదిరి), పలమాసి పాపన్న (రాప్తాడు), బి.ఇలియాజ్ (హిందూపురం), డి.నల్లప్ప (హిందూపురం), జీఆర్ రామ్మోహన్ (ధర్మవరం), వి.అక్రమ్‌ఖాన్ (మడకశిర), కార్యవర్గ సభ్యులుగా మెడికల్ సూర్యనారాయణ (పుట్టపర్తి), రామాంజినాయక్ (పుట్టపర్తి), చెన్నకృష్ణ (పుట్టపర్తి), నంది నరసింహులు (పుట్టపర్తి), భాస్కర్ రెడ్డి (పుట్టపర్తి), ఆర్.మేఘ (పెనుకొండ), ప్రమీలారాణి (పెనుకొండ), ఎస్.నారాయణప్ప (పెనుకొండ), బీసీ నాగరాజు (పెనుకొండ), కె.మైలారప్ప (మడకశిర), వి.నాగరాజు గుప్తా (మడకశిర), ఆనంద్ (మడకశిర), ఎం.దేవరాజ్ (మడకశిర), డి.శ్రీనివాసరెడ్డి (హిందూపురం), పి.కార్తీక్ (హిందూపురం), జె.శ్యామల (హిందూపురం), ఎండీ షరీఫ్ (హిందూపురం), శ్రీరామిరెడ్డి (కదిరి), డి.గణేశ్‌రెడ్డి (కదిరి), ఎం.నాగబయారెడ్డి (కదిరి), జె.శ్రీనివాసులు (కదిరి), పి.రామకృష్ణ (ధర్మవరం), ఎస్.రామాంజినేయులు (ధర్మవరం), బండి వీరనారప్ప (ధర్మవరం), ఎస్.ఉస్మాన్ (ధర్మవరం), ఆంజనేయులు (రాప్తాడు), గుడిసెల వెంకటేశ్ (రాప్తాడు), జె.ఓబులేసు (రాప్తాడు), జనార్దన్‌రెడ్డి (పుట్టపర్తి), పవన్‌కుమార్‌రెడ్డి (కదిరి)ని నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్

అనంతపురం సిటీ: నవరత్నాల అమలులో భాగంగా అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కేతన్‌గార్గ్ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏయే పథకం కింద ఇప్పటి వరకూ ఎంత మంది లబ్ధిపొందారనే వివరాలను తెలిపారు. మొత్తం 19,252 మందికి వివిధ పథకాల కింద రూ.11.24 కోట్ల లబ్ధి చేకూరినట్లు వివరించారు.

'ఉత్తమ' అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

ప్రశాంతినిలయం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన అందజేసే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వారు మండలస్థాయి కమిటీకి, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వారు డీవైఈఓ కమిటీకి ఈనెల 28 లోగా దరఖాస్తులను పంపాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేసిన తర్వాత సభ్యుల సంతకాలతో డీఈఓ కార్యాలయానికి ఈనెల 29 లోగా పంపాలన్నారు.

నేడు వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ

- హాజరు కానున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వైసీ తిమ్మారెడ్డి(ఫైల్)

మడకశిర: మాజీ ఎమ్మెల్యే, దివంగత వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముహూర్తం ఖరారైంది. మడకశిరలోని మధుగిరి రోడ్డులో వైబీ హళ్లి క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయన విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ హాజరు కానున్నారు. ఈ మేరకు వైసీ తిమ్మారెడ్డి కుమారుడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకరరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీ తిమ్మారెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, మడకశిర మండలం వైబీహళ్లికి చెందిన చిన్న తిమ్మారెడ్డి, నారెమ్మ దంపతులకు 1919లో తిమ్మారెడ్డి జన్మించారు. వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉంటూ వచ్చారు. 1959 నుంచి 1970 వరకు మడకశిర సమితి అధ్యక్షుడిగా, అనంతపురం జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. 1972 నుంచి 1978 వరకు ఎమ్మెల్సీగా, 1983 నుంచి 1985 వరకు ఎమ్మెల్యేగా విశిష్ట సేవలు అందించారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఓటమి చవి చూడని ఆయన 1986లో మృతి చెందారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నైతిక విలువలకు కట్టుబడి పని చేసిన వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మార్కెట్లకు లక్ష్మీ కళ



వరలక్ష్మీ అమ్మవారు

- జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు వరలక్ష్మీవ్రత శోభ
- కిటకిటలాడిన మార్కెట్లు



హిందూపురంలో పూల కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న మార్కెట్



పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతం పండుగ శోభ సంతరించుకుంది. శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. వరాలిచ్చే చల్లని తల్లి అయిన వరలక్ష్మీదేవి అనుగ్రహం కోసం మహిళలు విశేషంగా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలు, ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతం చేసుకోవడాని మహిళలు సిద్ధమయ్యారు. అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేకంగా వరలక్ష్మీ వ్రతాలను ఆచరించడానికి ఏర్పాట్లు చేశారు.

వరలక్ష్మి వ్రతంతో విశేష ఫలితాలు..

సౌరమానం ప్రకారం హిందూ సంవత్సరాదిలోని ఐదో నెల శ్రావణం.ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ పండగే. అయితే, శ్రావణమాసానికి పరిపూర్ణత, పరిపక్వతను తీసుకొచ్చేది వరలక్ష్మీ వ్రతం. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు ఈ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. శ్రీమహావిష్ణువు దేవేరి అయిన మహాలక్ష్మీ అష్టవిధ రూపాలతో సర్వ మానవాళి కోరికలు తీరుస్తూ, ఎల్లవేళలా రక్షిస్తుంది. కానీ అష్టలక్ష్ముల్లో వరలక్ష్మికి ఓ ప్రత్యేకత ఉంది. మిగతా లక్ష్మీల కంటే వరలక్ష్మిని పూజించడం చాలా శ్రేష్ఠం. శ్రీహరి జన్మ నక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే మాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు దక్కుతాయి. సర్వ మంగళ సంప్రాప్తి, సకలాభీష్టం, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని మహిళలు ఈ వ్రతం చేస్తారు.

వరలక్ష్మి వ్రతం ఇలా..

శ్రావణ శుక్రవారం రోజున స్త్రీలు వేకువజామున లేచి తాలారాస్నానం చేసి పట్టువస్త్రాలు ధరిస్తారు. తమ పూజా గదిలో మండపం ఏర్పాటు చేసి రావి, జువ్వి, మర్రి, మామిడి మొదలైన ఆకులతో కలశం ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని ఆహ్వానించి ప్రతిష్ఠిస్తారు. అమ్మవారిని ప్రత్యేక పూజలతో పూజించి భక్ష్య, భోజ్యాలతో నివేదిస్తారు. ప్రత్యేక పూజలు చేస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో అధికంగా చేస్తారు. ఈ పండుగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. వ్రతం రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచుకొంటారు.

వ్యాపారుల్లో నూతనోత్తేజం..

శ్రావణ మాసం రావడంతో వ్యాపారుల్లోనూ నూతనోత్తేజం సంతరించుకొంది. అన్ని వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఆషాడం, అధికమాసం రావడంతో రెండు నెలలుగా వ్యాపారాలు నత్తనడకన సాగాయి. నేడు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో పండ్లు, పూలు, నిత్యావరస వస్తువుల కొనుగోలుదారులతో మార్కెట్లు, ప్రధాన రోడ్లు కిటకిటలాడాయి.

అంకిత భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు : ఎస్పీ



లక్ష్మీనారాయణమూర్తికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: విధుల నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినప్పుడే ఉద్యోగికి సరైన గుర్తింపు ఉంటుందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. హిందూపురంలో హోంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మీనారాయణ మూర్తిని గురువారం తన చాంబర్‌లో ఎస్పీ ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. జిల్లాలో హోంగార్డులు తమ ఒక్క రోజు వేతనాన్ని రూ.4,39,200 చెక్కు రూపంలో ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనేది సర్వ సాధారణమని, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించినప్పుడే ప్రజల మన్నన పొందగలుగుతామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐ టైటాస్, నారాయణరాజు, పలువురు హోంగార్డులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణ పురోగతిపై పరిశీలన



జ్వాలాపురం శ్రీకాంత్‌కు వినతి పత్రం ఇస్తున్న వానవోలు గ్రామస్తులు

గోరంట్ల: మండలంలోని కరావులపల్లి తండ, రాగిమాకులపల్లి గ్రామాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆలయాల పురోగతిని ఆ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ గురువారం పరిశీలించారు. ఆయన వెంట దేవదాయ శాఖ కమిషనర్ మల్లికార్జునరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తండాలో రూ.56 లక్షల నిధులతో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని, రాగిమాకులపల్లిలో రూ.50 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ రెండు గ్రామాల్లో ఆలయాల నిర్మాణ పనులు 60 శాతం పూర్తైనట్లు తెలిపారు. అలాగే మండలపల్లిలో సీతారాముల ఆలయ నిర్మాణానికి రూ.1.25 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఆయనను వానవోలు గ్రామస్తులు కలసి తమ గ్రామంలోని కస్తూరి రంగనాథస్వామి ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం ఇచ్చారు.

హోరాహోరీగా జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు



పరుగుకు సిద్ధమైన ఎడ్ల బండి

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు ఎగువవీధి చితంబరరెడ్డి జ్ఞాపకార్థం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద గురువారం నిర్వహించిన ఎద్దుల బండ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షురాలు ఉషారాణి, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, లిఖిత్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్కంఠగా సాగిన ఈ పోటీలను రౌండ్ల వారీగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై పోటీలు ప్రారంభించారు. కదిరి, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, ధర్మవరంతో పాటు కర్ణాటక నుంచి 68 బండ్లను రైతులు తీసుకొచ్చారు. రెండేసి బండ్లకు పోటీ నిర్వహిస్తూ మొత్తం ఆరు రౌండ్లలో విజేతలను ఎంపిక చేశారు. కర్ణాటక నుంచి విచ్చేసిన ఎద్దులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి 8.30 గంటలకు పోటీలు ముగిసాయి. అనంతరం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు నిర్వాహకులు ఏవీ రమణారెడ్డి నగదు బహుమతులు అందజేశారు. సమయాభావం కారణంగా చివరగా పోటీలో నిలిచిన రైతులు బుక్కపట్నం జంగం వెంకటేషు, కొత్తచెరువు రోషన్, జగరాజుపల్లి లయకిషోర్, కొత్తచెరువు రామాంజనేయులు, వెల్దుర్తి సతీష్, బూసేపల్లి నాగభూషణకు చెరో రూ.15 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే ఇలాంటి పోటీలు తరచూ నిర్వహించడం ద్వారా రైతులను ఉత్తేజ పరిచినట్లవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలన్నారు.





నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పోటీలను చూసేందుకు వచ్చిన జనం

విద్యుదాఘాతంతో టెక్కీ మృతి



రామ్మోహన్ (ఫైల్)

తాడిమర్రి: విద్యుత్ షాక్‌కు గురై ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం కునుకుంట్లకు చెందిన గజ్జెల చిన్న యల్లప్ప, ముత్యాలమ్మ దంపతులకు ఐదుగురు కుమార్తెలు, ఓ కుమారుడు రామ్మోహన్ (32) ఉన్నారు. తన భార్య శ్రీలతతో కలసి బెంగళూరులోని ఓ కంపెనీలో రామ్మోహన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి పొలం పనులు చూసుకుని వెళ్లేవాడు. ఇటీవల ఎర్ర చందనం తోటలో డ్రిప్పు పరికరాలు దగ్ధమయ్యాయి. దీంతో బుధవారం రాత్రి రామ్మోహన్ డ్రిప్పు పరికరాలు తీసుకుని గ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం 11.30 గంటలకు తోటలో మోటార్‌కు అమర్చిన తీగలను మార్చే క్రమంలో చేత్తో పట్టుకుని లాగుతుండగా 11 కేవీ విద్యుత్ తీగలను తాగడంతో షాక్‌కు గురయ్యాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు, రైతు కూలీలు వెంటనే తీగలను కర్రలతో కొచ్చి తప్పించే ప్రయత్నం చేసే లోపు రామ్మోహన్ మృతి చెందాడు. కళ్ల ముందే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. మృతుడికి నాలుగేళ్ల వయసున్న కుమారుడు, రెండేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

గోరంట్ల: మండలంలోని కరావులపల్లికి చెందిన వడ్డే బాలు (26) అతిగా మద్యం సేవించి మృతి చెందాడు. మద్యానికి బానిసైన ఆ యువకుడు గురువారం ఉదయం కరావులపల్లి తండాకు వెళ్లి అతిగా మద్యం సేవించి గ్రామ చావిడిలో అపస్మారకస్థితిలో పడిపోయాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గమనించిన స్థానికులు యువకుడిని లేపేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకుని సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: ఓ చోరీ కేసులో తనను వేధిస్తున్నారంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు..గోరంట్లకు చెందిన సురేష్.. రొద్దం మండలంలోని ఓ క్వారీలో పనిచేస్తుండగా చోరీ జరిగింది. అయితే చోరీ చేసింది సురేష్ అని యజమాని ఫిర్యాదు మేరకు రొద్దం పోలీసులు కేసు నమోదు చేశారు. తనకు సంబంధం లేదని చెప్పినా విచారణ పేరుతో రొద్దం పోలీసులు వేధిస్తున్నారంటూ గురువారం ఉదయం గోరంట్ల పోలీస్ స్టేషన్ ఎదుట డీజిల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. సకాలంలో స్పందించిన పోలీసులు వెంటనే యువకుడి ప్రయత్నాన్ని విరమింపజేశారు. కాగా, ఘటనకు సంబంధించి యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

గంధపు చెక్కలు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంధం చెక్కలు చూపుతున్న పోలీసులు

గోరంట్ల: గంధపు చెట్లను నరికి చిన్న ముక్కలుగా చేసి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పట్టుబడిన వారిలో గోరంట్లకు చెందిన దేశయ్య, గజేంద్ర ఉన్నారు. వీరు కొడికొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో గంధం చెట్లను నరికి కర్ణాటకలోని సిరా ప్రాంతానికి తరలిస్తుండగా గొల్లపల్లి క్రాస్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గంధపు చెక్కలు స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చర్యలు

- కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'మాతా శిశు మరణాలు సంభవించకుండా ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. బడి బయట ఉన్న విద్యార్థులందరినీ పాఠశాలలు, కళాశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నాం ' అని కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి తెలిపారు. గురువారం సాయంత్రం డాక్టర్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించి ప్రసవాలు జరిగేలా చూస్తామన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకుంటామని, రక్తహీనతతో ఎవరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈనెల 30న జగనన్న కాలనీలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాడు – నేడు పనులు త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వైఎస్సార్ బీమా పొందడానికి లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు వెంటనే జారీ చేసి బీమా వర్తింపజేస్తామన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సెప్టెంబర్ 17న ప్రారంభిస్తున్నారన్నారు. ఇందుకు గాను 18 రకాల కళాకారులు (బంగారుపని, కుమ్మరి పని, బోట్లు తయారీ, టైలర్లు మొదలైనవారు) గుర్తించి ఈ పథకం కిందికి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. వారికి రూ.2 లక్షల వరకూ రుణ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డిఈఓ మీనాక్షి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

యూపీ డ్రైవర్‌కు టోకరా

- బాడుగ పేరుతో రూ.10 వేలు దండుకున్న మోసగాడు



లారీ డ్రైవరు రైస్‌పాల్, డబ్బుతో ఉడాయించిన అగంతకుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: లారీకి బాడుగ ఉందంటూ నమ్మించి యూపీకి చెందిన ఓ డ్రైవర్‌ను మోసగించి రూ.10 వేలు దండుకున్న మోసగాడిపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ ప్రాంతానికి చెందిన రైస్‌పాల్... లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురానికి లోడు తీసుకువచ్చిన ఆయన అన్‌లోడింగ్ తర్వాత గురువారం ఉదయం బాడుగ కోసం లారీని బళ్లారి బైపాస్‌లో పెట్టుకుని ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో ఓ వ్యక్తి ఫోన్ చేసి కాన్పూరుకు కర్బూజా లోడు ఉందని, తాడిపత్రి రోడ్డులోని చెరువు కట్ట వద్ద ఉన్న కాటా వద్దకొస్తే తోటకెళ్లి లోడు చేయించుకుని వద్దామంటూ తెలిపాడు. దీంతో రైస్‌పాల్ లారీని తీసుకుని కాటా వద్దకు చేరుకున్నాడు. అక్కడ ఓ యువకుడు కలసి లారీ డ్రైవర్‌తో మాటలు కలిపాడు. తోటలో కాయలు లోడు చేసేందుకు అవసరమైన అట్ట బాక్సులు తీసుకోవాలని, గ్రామంలోకి వెళ్లగానే డబ్బు ఇచ్చేస్తాను ఓ రూ.50 వేలు ఉంటే ఇవ్వాలని నమ్మబలికాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని, యజమాని తన దారి ఖర్చుల కోసం ఇచ్చిన రూ.10 వేలు మాత్రమే ఉన్నాయని రైస్‌పాల్ తెలపడంతో ఆ డబ్బు తీసుకుని అట్టలు తీసుకువచ్చేంత వరకూ అక్కడే వేచి ఉండాలని తెలిపి వెళ్లిపోయాడు ఎంతసేపటికీ ఆగంతకుడు రాకపోవడంతో రైస్‌పాల్ ఫోన్ చేశాడు. స్పందన లేకపోవడంతో పలుమార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. చివరకు జరిగిన విషయాన్ని అక్కడున్న వారికి తెలపడంతో ఆగంతకుడి సెల్‌ఫోన్‌కు వారు కాల్ చేయడంతో లిఫ్ట్ చేసి.. అతనెవరో తనకు తెలియదని బుకాయించి స్విచ్చాఫ్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన రైస్‌పాల్ జరిగిన మోసంపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా మోసగాడిని గుర్తించి, గాలింపు చేపట్టారు.

కరుణించు వరుణదేవా..



మడకశిరరూరల్: అరకొర వర్షాలు పడటంతో అన్నదాతలు వరుణుడి కరుణ కోసం వినూత్న రీతిలో పూజలు, పునస్కారాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మడకశిర మండలం హరేసముద్రంలో గురువారం సాయంత్రం గాడిదలకు పెళ్లిళ్లు జరిపించారు. గార్దభాలను అలంకరించి కరుణించు వరుణ దేవా అంటూ గ్రామంలో ఊరేగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కదిరి అర్బన్: మండలంలోని ముత్యాలచెరువు పంచాయతీ సమీపంలో ఉన్న కరావుల కుంట వద్ద గురువారం ఉదయం వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. వయస్సు దాదాపు 45 ఏళ్లు ఉంటాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు కదిరి పోలీసులను స్పందించాలని సీఐ సూర్యనారాయణ కోరారు.

వేధింపుల కేసు నమోదు

తలుపుల: నల్లచెరువు మండలం మొలకవారిపల్లికి చెందిన ఈశ్వరప్ప, ఆయన కుటుంబసభ్యులపై అదనపు కట్నం వేధింపుల కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపారు. వివరాలు... తలుపుల మండలం మూలపల్లికి చెందిన సూర్యనారాయణ కుమార్తె జ్యోతికి రెండేళ్ల క్రితం మొలకలవారిపల్లికి చెందిన చిన్న రమణ కుమారుడు ఈశ్వరప్పతో వివాహమైంది. బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేస్తూ ఏడాది పాటు భార్యను బాగానే చూసుకున్నాడు. అనంతరం అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్తతో పాటు అత్త, మామ వేధించసాగారు. ఈ క్రమంలోనే నాలుగు రోజుల క్రితం ఆమె మెడలోని తాళి బొట్టును సైతం లాక్కొని గెంటేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరుకుంది. ఘటనకు సంబంధించి జ్యోతి ఫిర్యాదు మేరకు ఈశ్వరప్ప, ఆయన తల్లిదండ్రులు, మరో ముగ్గురిపై అదనపు కట్నం వేధింపుల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి మృతి

హిందూపురం అర్బన్: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని కొట్నూరు రైల్వే గేటు సమీపంలో గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని యువకుడు (22) రైలు కింద పడి మృతి చెందాడు. బెంగళూరు నుంచి పెనుకొండ వైపు వెళ్లే రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు రైలు నుంచి జారి పడ్డాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.



తెలుగు సినిమా... ఎత్తర జెండా

సినిమా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు



హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్ఆర్ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్ఆర్ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్ఆర్ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్ఆర్ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్ఆర్ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్ఆర్ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధంధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.


● విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్ధమ్)


● ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)


● కృతీసనన్ (మిమీ)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బోనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.
- వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. - చిరంజీవి

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్ఆర్ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్ఆర్ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.
- రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. - కీరవాణి

★★★

ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. - ఆలియా భట్.

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. - అల్లు అరవింద్

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్ఆర్ఆర్ సిక్సర్


● కీరవాణి ● శ్రీనివాస్ మోహనన్ ● కాలభైరవ ● ప్రేమ్ రక్షిత్ ● కింగ్ సాల్మన్


● దేవిశ్రీ ప్రసాద్ ● చంద్రబోస్ ● పురుషోత్తమాచార్యులు ● బుచ్చిబాబు


● కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

ఇదొక చరిత్ర

- నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.
- నవీన్ యెర్నేని, నిర్మాత

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్ఠాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్ఆర్ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.
- వై. రవిశంకర్, నిర్మాత


''నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి'' అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. ''రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు.
- బుచ్చిబాబు సన, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబి యార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబి నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను - ఎంఎం శ్రీలేఖ



''ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడేవారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం'' అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరఫున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ - ''మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య- కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను'' అన్నారు.

69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) - కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి- మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్ఆర్ఆర్ - ఎమ్ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప- దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్ఆర్ఆర్ -ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్ఆర్ఆర్ - కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్- కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్ఆర్ఆర్- కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్ఆర్ఆర్- శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ- హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిళల్- తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ - మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ - సోనూ కేపీ (చవిట్టు మూవీ-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ, ఉత్కర్షిణీ వశిష్ఠ (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా - ఉత్కర్షిణీ వశిష్ఠ (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్ధమ్ మూవీ-హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో - గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్‌జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్-ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్ఆర్ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జీలీ మూవీ- బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్థన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీపింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కొకో-హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష్య (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతీశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం-బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదంని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం-బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.

